# ఇథనాల్ ఫ్యాక్టరీని మూసివేయాలి!

- కాలుష్యంపై అఖిలపక్షం 'రైతు యుద్ధం'
- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత
- ప్రజల ఆరోగ్యంతో ఆడుకోవద్దని హెచ్చరిక



**బెజ్జంకి, మే 13 (జనం పవర్):** బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ళ, శంకర్ నగర్ గ్రామాల్లో ఉన్న ఇథనాల్ ఫ్యాక్టరీని వెంటనే మూసివేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. "రైతు యుద్ధం ఉ ప్రజా ఆరోగ్యం" పేరిట మండల కేంద్రంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఫ్యాక్టరీల వల్ల ఎదురవుతున్న కాలుష్య సమస్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీల నుండి వెలువడుతున్న విషవాయువులు ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ప్రమాదకరంగా మారాయని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. భూమి, పర్యావరణం కాలుష్యమవుతుండటంతో పాటు రైతుల వ్యవసాయ భూములు దెబ్బతింటున్నాయని తెలిపారు. తీవ్రమైన శబ్ద కాలుష్యం కారణంగా గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కాలుష్య నియంత్రణ చర్యలు వెంటనే చేపట్టి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. రైతుల భూములకు రక్షణ కల్పించే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో లింగాల సురేష్, వంగల నరేష్, తిప్పారపు శ్రీనివాస్, సంగెం మదు, తిప్పారపు మహేష్, బోనగిరి శివ, దొంతరవేని శ్రీనివాస్, హరీష్, లింగాల వెంకటేశ్, నర్సింగ్, మాంకాళి సురేష్, సంఘ ఎల్లయ్య, బొమ్మిడి సాయికృష్ణ, బోనగిరి లింగం, పర్శరాములు, మధు, శ్రీనివాస్, లింగయ్య, విజయ్, శంకర్, చంద్రం, మాల మహానాడు, స్వేరో సంస్థల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అధికారులు స్పందించి ఫ్యాక్టరీని మూసివేసేలా చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా కోరారు.

# మైసంపల్లిలో తీరనున్న తాగునీటి కష్టాలు!

## 15వ ఫైనాన్స్ నిధులతో పైప్‌లైన్ నిర్మాణం

**వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు**

**ఎమ్మెల్యే హరీష్ రావు సహకారంతో అభివృద్ధి**





**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

నంగునూర్ మండలం మైసంపల్లి గ్రామంలో తాగునీటి సమస్యను అరికట్టేందుకు గ్రామ పంచాయతీ పకడ్బందీ చర్యలు చేపట్టింది. 15వ ఫైనాన్స్ నిధులతో కొత్త పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు సర్పంచ్ నరేష్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే హరీష్ రావు సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని ఆయన వెల్లడించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరం నీటి సరఫరాలో తలెత్తే ఇబ్బందులను అధిగమించేందుకు ఈ పనులు చేపట్టారు. ఎస్సీ కాలనీలోని 3 ఫేజ్ బోర్ నుండి డబుల్ బెడ్‌రూమ్ ఓవర్ హెడ్ ట్యాంక్ వరకు సుమారు 350 మీటర్ల పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. అలాగే గతవారం బీసీ కాలనీలోని బోర్ నుండి ఓవర్ హెడ్ ట్యాంక్ వరకు సుమారు 170 మీటర్ల పైప్‌లైన్ నిర్మించారు. ఈ రెండు 3 ఫేజ్ మోటార్లను ట్యాంకులకు అనుసంధానం చేయడం ద్వారా గ్రామంలో నీటి కొరత సమస్య పూర్తిగా తీరుతుందని సర్పంచ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పనుల అమలులో సహకరించిన వార్డు సభ్యులు, గ్రామస్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# నక్కగాగులో అక్రమ ఇసుక ఫిల్టర్లపై చర్యలు!

**తహసీల్దార్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి తనిఖీలు**

**13 మందికి షోకాజ్ నోటీసుల జారీ**



**కంది, మే 13 (జనం పవర్):** కంది మండలంలోని బోతోల్, చిద్రూప గ్రామాల్లోని నక్కగాగు పరిస్థితిపై అధికారులు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఎమ్.ఆర్.ఓతో పాటు నీటిపారుదల శాఖ అధికారులు, సహాయ సాంకేతిక మేనేజర్ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. వాగులో జరుగుతున్న ఇసుక ఫిల్టర్ నిర్వహణ పనులను అధికారులు సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా అనుమతి లేకుండా, నిబంధనలు పాటించకుండా ఇసుక ఫిల్టర్లు నిర్వహిస్తున్న 13 మందిని అధికారులు గుర్తించారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయిస్తూ, బాండ్ బుక్ చేసే ఉద్దేశంతో షోకాజ్ నోటీసులు పంపించారు. అక్రమంగా ఇసుకను తరలించడం లేదా శుద్ధి చేయడం వంటి పనులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇసుక ఫిల్టర్లకు సహకరిస్తున్న పట్టాదారులపై కూడా నోటీసులు జారీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. గాగు పరిరక్షణతో పాటు అక్రమ కార్యకలాపాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



# మేరు కులస్తుల కల సాకారం.. కార్పొరేషన్ ఏర్పాటు!

**చైర్మన్‌గా సంఘ వెంకట రాజ్యం నియామకం**

**వైస్ చైర్మన్‌గా మాడిశెట్టి లక్ష్మీ నారాయణ**

**కామారెడ్డి/బిచ్కుంద, మే 13 (జనం పవర్):** కామారెడ్డి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మేరు (దర్జీ) కులస్తుల చిరకాల కోరికను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చింది. మేరు సంఘం కులం కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను కేటాయించడం పట్ల తెలంగాణలోని 90 లక్షల పైచిలుకు కుల సభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. బీసీ క్రమ సంఖ్య ఐదులో ఉన్న మేరు కులం అభివృద్ధికి ఈ కార్పొరేషన్ కీలక మైలురాయిగా నిలవనుంది. నూతనంగా ఏర్పడిన ఈ కార్పొరేషన్ చైర్మన్‌గా సంఘ వెంకట రాజ్యం, వైస్ చైర్మన్‌గా మాడిశెట్టి లక్ష్మీ నారాయణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం పట్ల మేరు సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే వీరి ప్రమాణ స్వీకార మహోత్సవం అట్టహాసంగా నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బిచ్కుంద మేరు సంఘం సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్‌లను శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కులస్తుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న ఈ చొరవపై వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిచ్కుంద మండల మేరు సంఘం ప్రతినిధులు, సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# లక్సెట్టిపేటలో పేకాట స్థావరంపై పోలీసుల మెరుపుదాడి!

**బాలాజీ లాడ్జిలో జూదం ఆడుతున్న ఆరుగురు అరెస్ట్**

**రూ. 1.20 లక్షల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం**

**నిందితులతో పాటు లాడ్జి యజమానిపై కేసు నమోదు**



**వేల్పుల నగేష్, జనం పవర్-ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో**

లక్సెట్టిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పట్టణ కేంద్రంలో ఉన్న బాలాజీ లాడ్జిలో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో పోలీసులు మెరుపుదాడి చేశారు. సీఐ రమణమూర్తి ఆధ్వర్యంలో ఎస్సై, పోలీస్ సిబ్బంది మంగళవారం రాత్రి లాడ్జిలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఆరుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. జూదానికి పాల్పడుతున్న వారి వద్ద నుంచి పెద్ద ఎత్తున నగదు, మొబైల్ ఫోన్లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న ఆరుగురు నిందితులతో పాటు జూదానికి సహకరించిన లాడ్జి యజమానిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టుబడిన వారి వద్ద నుంచి 52 పేకముక్కలు, రూ. 1,20,770 నగదు, ఒక స్కూటీ (టీఎస్ 19 హెచ్ 5838), ఆరు సెల్‌ఫోన్లు, నాలుగు బెడ్లు, ఒక కూలర్‌ను సీజ్ చేశారు. పట్టణంలో ఎక్కడైనా అక్రమ కార్యకలాపాలు సాగితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ దాడిలో మసాలా సతీష్, రాందేని తిరుపతి, హెచ్. వి. హేమంత్ కుమార్, ఎలేశ్వర్ సమ్మయ్య, మోపర్తి హనుమంతరావు, సయ్యద్ అబ్బాస్, నల్మాస్ మణిదీప్ పట్టుబడ్డారు. వీరందరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులను కోర్టులో హాజరు పరచనున్నట్లు సమాచారం.

# ఇసుక లారీ బీభత్సం

**వరి ధాన్యం ట్రాక్టర్‌ను వెనుక నుండి ఢీకొన్న లారీ**

**రెండు కార్లు ధ్వంసం.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు**

**లారీ డ్రైవర్ పరారీ.. కేసు నమోదు చేసిన పోలీసులు**

**బెజ్జంకి, మే 13 (జనం పవర్):** బెజ్జంకి మండలంలోని రేగులపల్లి గ్రామ శివారులో ఉన్న రాజీవ్ రహదారిపై బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కోహెడ మండలం తంగళ్ళపల్లి గ్రామానికి చెందిన చొప్పరి సంపత్ (38) బెజ్జంకి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తంగళ్లపల్లి గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రం నుండి వరి ధాన్యంలోడుతో చొప్పరి సంపత్ చిన్నకోడూరు మండలం మల్లారం గ్రామ శివారులోని రామాంజనేయ ఆగ్రో రైస్ మిల్లుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బెజ్జంకి మండలంలోని రేగులపల్లి గ్రామ శివారులో ఉన్న పల్లోటి స్కూల్ సమీపానికి చేరుకోగానే, ఇసుక లారీ డ్రైవర్ అజాగ్రత్తతో వరి ధాన్యం లోడుతో ఉన్న టీఎస్ 22 టీ 1099 నెంబర్ గల ట్రాక్టర్‌ను వెనుక నుండి బలంగా ఢీకొట్టాడు. లారీ (టీఎస్ 36 టీఏ 6966) ఢీకొట్టిన వేగానికి ట్రాక్టర్ అదుపుతప్పి ముందుకు వెళ్లి అక్కడ ఉన్న మారుతి బ్రీజా (టీజీ 02 బీ 0671), ఇన్నోవా (టీజీ 21 టీ 1653) వాహనాలను ఢీకొట్టింది. చివరకు రోడ్డు పక్కన ఉన్న ఓ చెట్టును ఢీకొట్టి ఆగింది. ఈ ప్రమాదంలో రెండు కార్లు తీవ్రంగా దెబ్బతినగా, ట్రాక్టర్‌లో ఉన్న వరి ధాన్యం కొంతమేరకు రోడ్డుపై చెదిరిపోయింది. అలాగే ట్రాక్టర్ ట్రైలర్ కూడా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ చొప్పరి చందుకు ఛాతి, తొడ భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం సిద్దిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ వాహనాన్ని ఘటనా స్థలంలోనే వదిలి పరారయ్యాడు. ఈ మేరకు బెజ్జంకి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వాహన చోదకులు రాజీవ్ రహదారిపై అతివేగంతో వెళ్లడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఉపాధి పనులు ఉదయాన్నే పూర్తి చేయాలి!

**బస్వాపూర్‌లో ఎంపీడీఓ కృష్ణయ్య తనిఖీ.. కూలీల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత**



**కోహెడ, మే 13 (జనం పవర్):** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న చెరువుల పూడికతీత పనులను ఎంపీడీఓ కృష్ణయ్య బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పని ప్రదేశానికి వెళ్లి కూలీలతో నేరుగా మాట్లాడారు. పనుల పురోగతి గురించి ఆరా తీయడంతో పాటు వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున కూలీలు ఉదయం 6 గంటలకే పనులకు హాజరవ్వాలని ఎంపీడీఓ సూచించారు. ఎండ పెరగకముందే పనులు పూర్తి చేసుకుని వెళ్లడం శ్రేయస్కరమని తెలిపారు. కార్మికులు చేసిన పనులకు సంబంధించిన కూలి డబ్బులు వెంటనే వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయని వివరించారు. పని ప్రదేశంలో ప్రతిరోజు తాగునీరు, నీడ కోసం షెడ్ నెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి రేఖను ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి కనీసం 150 మంది కార్మికులు పనులకు వచ్చేలా చూడాలని మేట్ రాజు, కార్యదర్శికి సూచించారు. మండల వ్యాప్తంగా ప్రస్తుతం ప్రతిరోజూ 2000 మందికి పైగా కార్మికులు పనుల్లో పాల్గొంటున్నారని కృష్ణయ్య తెలిపారు. గ్రామాల్లో ఉపాధి కల్పించడంతో పాటు చెరువుల అభివృద్ధి, భూగర్భ జలాల పరిరక్షణకు ఈ పనులు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాల అభివృద్ధికి ప్రజాప్రతినిధుల మద్దతు

**విద్యా వారోత్సవాల్లో భాగంగా ప్రజాప్రతినిధులతో సమావేశం**

**అడ్మిషన్ల పెంపు, మౌలిక వసతులపై ప్రిన్సిపాల్ చర్చ**

**సమస్యల పరిష్కారానికి వార్డు సభ్యుల హామీ**



**జుక్కల్, మే 13 (జనం పవర్):** బిచ్కుందలోని ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ఆదేశాల మేరకు 99 రోజుల 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' విద్యా వారోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మూడవ రోజు కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ప్రజా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. అశోక్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించి, కార్యక్రమ ముఖ్య లక్ష్యాలను నేతలకు వివరించారు. కళాశాల అభివృద్ధిలో స్థానిక నాయకత్వ సహకారం ఎంతైనా అవసరమని, అడ్మిషన్ల పెంపుతో పాటు మౌలిక వసతుల కల్పన ఆవశ్యకతను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. కార్యక్రమానికి హాజరైన మున్సిపాలిటీ వార్డు సభ్యులు స్పందిస్తూ.. కళాశాల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా చొరవ తీసుకుంటామని తెలిపారు. అనంతరం కళాశాల సిబ్బంది ప్రజాప్రతినిధులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యా ప్రమాణాల మెరుగుదలకు కళాశాల యాజమాన్యం తీసుకుంటున్న చర్యలను నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అసద్ అలీ, కోఆపరేటివ్ సభ్యులు విజయ భాస్కర్ రెడ్డి, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు, మున్సిపాలిటీ కౌన్సిలర్లు మారుతి, సాందని, నౌషనాయక్, స్థానిక నాయకులు బొగడ మీది సాయిలు, చింతల్ వార్ హనుమాన్లు పాల్గొన్నారు. కళాశాల సిబ్బందిలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. వెంకటేశం, కోఆర్డినేటర్ డాక్టర్ టి. హనుమాడ్లు, పీజీ కోఆర్డినేటర్ టి. సంతోష్ కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి. రమేష్ బాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ భద్రతకు సీసీ కెమెరాల రక్షణ!

**రూ. 6 లక్షల వ్యయంతో 42 కెమెరాల ఏర్పాటు**

**ప్రారంభించిన సంగారెడ్డి రూరల్ ఎస్సై మధుసూదన్ రెడ్డి**



**కంది, మే 13 (జనం పవర్):** గ్రామ పంచాయతీ నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని సంగారెడ్డి రూరల్ ఎస్సై మధుసూదన్ రెడ్డి తెలిపారు. బుధవారం కంది మండలం చిమ్లాపూర్ గ్రామంలో సుమారు రూ. 6 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 42 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల గ్రామంలో దొంగతనాలు తగ్గే అవకాశం ఉందని, నేరాల నియంత్రణకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామ భద్రతను మరింత బలోపేతం చేయడానికి పంచాయతీ పాలకవర్గం తీసుకున్న ఈ చర్య మంచి ఫలితాలను ఇస్తుందని ఎస్సై ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోవడం వల్ల శాంతిభద్రతల పరిరక్షణ సులభతరం అవుతుందని తెలిపారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణగౌడ్, ఉపసర్పంచ్ మోతీలాల్, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా భద్రతకు పెద్దపీట వేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియ వేగవంతం చేయాలి!

**21న కేబినెట్ భేటీ నాటికి పూర్తి నివేదిక సిద్ధం చేయాలి**

**మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి వెల్లడి**

**అర్హులైన వారికే చోటు కల్పించాలని సూచన**

**హైదరాబాద్, మే 13 (జనం పవర్):**

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రారంభమైన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని మీడియా అకాడమీలో జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపుతోందని అన్నారు.

**కేబినెట్ భేటీ నాటికి నివేదిక**

మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 21న జరుగనున్న కేబినెట్ సమావేశం నాటికి హైదరాబాద్‌లో ఉన్న అన్ని సొసైటీల పూర్తి వివరాలను, జర్నలిస్టుల సంఖ్యతో కూడిన నివేదికను తయారు చేయాలని సూచించారు. ఇందుకు అన్ని సొసైటీలు సమిష్టిగా సహకరించాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులను మాత్రమే జాబితాలో చేర్చాలని సొసైటీల ప్రతినిధులను కోరారు.

**జేఏసీలోకి మరిన్ని సొసైటీలు**

ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఆ సొసైటీని కూడా పరిగణలోకి తీసుకుని జేఏసీలో చేర్చారు. అదేవిధంగా మహాత్మాగాంధీ జర్నలిస్ట్స్ సొసైటీని కూడా చేర్చారు. గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి సోమయ్య, బొల్లం శ్రీనివాస్ తమ సొసైటీ సభ్యుల జాబితాను సమర్పించారు. ఈ సమావేశంలో ఐఅండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్ డీఎస్ జగన్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, వివిధ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీల ప్రతినిధులు పాల్గొన్నారు.



**కౌలాస్ నాల గేట్ల మరమ్మతు..**

# నేటి నుంచి నీటి విడుదల!

- తొమ్మిది గేట్ల వైర్ రోప్స్ మార్చేందుకు నిర్ణయం
- 100 క్యూసెక్కుల నీరు విడుదల చేయనున్న అధికారులు
- కాలువలకు దూరంగా ఉండాలని ప్రజలకు హెచ్చరిక

**జుక్కల్, మే 13 (జనం పవర్):** జుక్కల్ మండలంలోని సవర్ గాం వద్ద ఉన్న కౌలాస్ నాల ప్రాజెక్టు గేట్లకు మరమ్మత్తులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. మొత్తం తొమ్మిది గేట్ల వైర్ రోప్స్ (గేట్ త్రాడులు) మార్చే పనుల నేపథ్యంలో, నేటి (గురువారం) నుండి ప్రాజెక్టు నీటిని ప్రధాన కాలువ ద్వారా విడుదల చేస్తున్నట్లు ఏఈ అశ్విని ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుండి ప్రారంభించి మొదట 100 క్యూసెక్కుల నీటిని వదులుతామని, అనంతరం మూడు రోజుల పాటు ఆ పరిమాణాన్ని 150 క్యూసెక్కులకు పెంచుతామని వివరించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 454.55 క్యూసెక్కుల నీరు నిల్వ ఉందని ఆమె పేర్కొన్నారు. నీటి విడుదల దృష్ట్యా వరద కాలువ పరిసర ప్రాంతాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. పశువుల కాపరులు తమ జీవాలను కాలువలకు దూరంగా ఉంచాలని, మత్స్యకారులు వాగులోకి దిగవద్దని సూచించారు. ముఖ్యంగా వేసవి కాలం కాబట్టి స్నానాల కోసం లేదా ఈత కోసం ప్రజలు కాలువలు, వాగుల వద్దకు వెళ్లకూడదని, వాగు దాటే ప్రయత్నం చేయవద్దని కోరారు. ప్రాజెక్టు మరమ్మత్తు పనులు సకాలంలో పూర్తి చేయడానికి ప్రజలు తమ వంతు సహకారం అందించాలని ఏఈ అశ్విని విజ్ఞప్తి చేశారు.

# మహిళా అక్షరాస్యతే లక్ష్యం.. 'ఉల్లాస్' ప్రారంభం

- 15 ఏళ్లు పైబడిన వారికి చదువు చెప్పేలా ప్రణాళిక
- సిద్దిపేటలో 1300 మంది నిరక్షరాస్య మహిళల గుర్తింపు
- 'అమ్మకు అక్షరమాల'తో సాధికారతకు బాటలు



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో 'ఉల్లాస్' (సమాజంలోని అందరికీ జీవితకాల అభ్యాసంపై అవగాహన) అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా ఎస్ఎల్ఎఫ్ ఓబీలు, ఆర్పీలకు నిర్వహించిన శిక్షణను కమిషనర్ అశ్రిత్ కుమార్ బుధవారం ప్రారంభించారు. చదువుకునే అవకాశం లభించని 15 ఏళ్లు పైబడిన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని మహిళా సంఘాల్లో దాదాపు 1300 మంది నిరక్షరాస్యులను గుర్తించామని, వారికి స్వచ్ఛందంగా చదువు చెప్పేందుకు ఈ శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఆర్పీ, ఓబీ కనీసం 10 మంది నిరక్షరాస్యులకు చదువు బోధించాలని కమిషనర్ సూచించారు. 'అమ్మకు అక్షరమాల' ద్వారా ప్రతి మహిళ అక్షరాస్యురాలిగా మారాలని ఆకాంక్షించారు. మహిళలు చదువుకుంటే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయని, ముఖ్యంగా ఇంటి మహిళ విద్యావంతురాలైతే పిల్లల భవిష్యత్తు బాగుంటుందని పేర్కొన్నారు. ఉల్లాస్ పథకం కేవలం అక్షరాస్యత మాత్రమే కాదని.. మహిళల ఆత్మవిశ్వాసం, సామాజిక స్థితిని పెంచే ఒక సాధికారత ఉద్యమమని స్పష్టం చేశారు.

**ఉపాధి అవకాశాలపై దృష్టి**

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడంతో పాటు, మధ్యలో చదువు మానేసిన వారిని గుర్తించి ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఆసక్తి ఉన్న వారికి డిగ్రీ వరకు చదివించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని కమిషనర్ తెలిపారు. మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్, టెక్నికల్ కోర్సులు అందించి ఉపాధి అవకాశాలు కల్పించేలా ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హన్మంత్ రెడ్డి (డీఎంసీ), శ్రీకాంత్ (రెవెన్యూ ఆఫీసర్), శ్రీనివాస్ (విద్యాశాఖ), రేణుక, జ్యోతి (సీఓ), ఎస్ఎల్ఎఫ్ ప్రతినిధులు, ఆర్పీలు పాల్గొన్నారు.

# గాయపడిన హనుమాన్ స్వాములకు పరామర్శ

**సురక్ష ఆసుపత్రిలో బాధితులను కలిసిన పూజల హరికృష్ణ**

**మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు విన్నపం**

**కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా**



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

భద్రాచలం నుండి విజయవాడకు హనుమ మాల విరమణ కార్యక్రమానికి వెళ్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన భక్తులను సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ పరామర్శించారు. ప్రస్తుతం సిద్దిపేట పట్టణంలోని సురక్ష ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నంగునూరు మండలం అప్పలాయ చెరువు, నర్మెట గ్రామాలకు చెందిన హనుమాన్ స్వాములను ఆయన కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గాయపడిన భక్తులకు ధైర్యం చెబుతూ.. త్వరగా కోలుకుని సురక్షితంగా తమ గ్రామాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సంబంధిత వైద్యులను కోరారు. పూజల హరికృష్ణ మాట్లాడుతూ భక్తుల ప్రాణ భద్రత అత్యంత ముఖ్యమని, ప్రయాణాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదంలో గాయపడిన కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. భక్తులు త్వరగా కోలుకుని సాధారణ జీవితానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. బాధితుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కలీముద్దీన్ అహ్మద్, దాస అంజన్న, మార్క సతీష్, రాజబహాదూర్ రెడ్డి, కొత్త మహిపాల్ రెడ్డి, ఎర్ర మహేందర్, ఏఎంసీ వైస్ చైర్మన్ బస్సా రాజశేఖర్, సాధుల పవన్ కుమార్, ఏఎంసీ డైరెక్టర్లు ఎండీ ఇమ్రాన్, తిప్పని రాజేష్, పిడిశెట్టి ప్రభాకర్, జీవన్ నాయక్, ఐలయ్య పాల్గొన్నారు. బాధితులకు అందుతున్న వైద్య సహాయంపై వారు ఆరా తీశారు.

# ఘనంగా ప్రమోద్ కుమార్, వందిత వివాహం

**వధూవరులను ఆశీర్వదించిన పలువురు ప్రముఖులు**

**తరలివచ్చిన వీరశైవ లింగాయత్ సమాజ సభ్యులు**

**సదాశివపేట, మే 13 (జనం పవర్):** సదాశివపేట పట్టణంలోని జగద్గురు సేవా సదన్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం వివాహ వేడుకలు వైభవంగా జరిగాయి. స్థానిక వాణి, రవి స్వామిల కుమారుడు, మరకత లింగం ఆలయ ప్రధాన పూజారి శ్రీ ప్రమోద్ కుమార్, శ్రీ వందిత వివాహం ఘనంగా నిర్వహించబడింది. ఈ వేడుకకు పట్టణంలోని ప్రముఖులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ శుభకార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజం జిల్లా సలహాదారు అమ్మిశెట్టి జయప్రకాష్, జంగమ అర్చక పురోహిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు మదుపతి సంతోష్ కుమార్ స్వామి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వధూవరులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. మరకత లింగం ఆలయ ప్రధాన పూజారి వివాహం కావడంతో భక్తులు, సమాజ సభ్యులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పెళ్లి వేడుకకు హాజరైన వారందరికీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వచ్చిన వారందరూ నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకతో సదాశివపేటలో సందడి నెలకొంది.



# పార్టీ బలోపేతమే నా లక్ష్యం



## గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడిగా దరిపెల్లి చంద్రం బాధ్యతల స్వీకారం

### నేతలందరినీ కలుపుకుని ముందుకు సాగుతాం

### ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందాలి



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన అధ్యక్షుడిగా నియమితులైన దరిపెల్లి చంద్రం బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలు కీలక విషయాలను వెల్లడించారు. తనకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని దరిపెల్లి చంద్రం పేర్కొన్నారు.

**ఎన్నికలకు సన్నద్ధం**

చిన్నా పెద్దా తేడా లేకుండా అందరినీ కలుపుకుని ముందుకు సాగుతూ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడమే తన లక్ష్యమని చంద్రం చెప్పారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానిస్తూ, కార్యకర్తల సమన్వయంతో పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వార్డు వారీగా కాంగ్రెస్ జెండా పండుగలు నిర్వహించి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్తామని వివరించారు. రైతుల కోసం ధాన్యం కొనుగోలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తూ అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.

**సంక్షేమ పథకాలపై దృష్టి**

సన్నబియ్యం, రేషన్ కార్డులు, ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పార్టీకి అతీతంగా ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తామని చెప్పారు. యువతకు కాంగ్రెస్ పార్టీ పక్షాన మంచి భవిష్యత్తు కల్పించేందుకు కృషి చేస్తానని, నిరుద్యోగ సమస్య పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తానని దరిపెల్లి చంద్రం పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలు ప్రజలకు మేలు చేస్తున్నాయని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించిందని గుర్తు చేశారు. ప్రజలకు గ్రంథాలయ సేవలను మరింత చేరువ చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని దరిపెల్లి చంద్రం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సూర్య వర్మ, దాసరి రాజు, నాగరాజు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



# విదేశీ కొలువులకు మందమర్రి వేదిక

- పట్టుదల ఉంటే విదేశాల్లో ఉద్యోగం ఖాయం
- రూ. 2 లక్షల వరకు వేతనం.. వారానికి 35 గంటల పని
- టామ్ కామ్ శిక్షణకు ప్రభుత్వం రూ. 90 కోట్ల కేటాయింపు
- మంత్రి వివేక్



**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో**

సాధించాలనే పట్టుదల, క్రమశిక్షణ ఉన్న నిరుద్యోగ యువతను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ లో టామ్ కామ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, జిల్లా ఉపాధి అధికారి రవికృష్ణ, తహసీల్దార్ సతీష్ కుమార్, టామ్ కామ్ మేనేజర్ అనిల్ కుమార్ లతో కలిసి ఆయన శిక్షణ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

**విదేశాల్లో అపార అవకాశాలు**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సరైన విద్య, నైపుణ్యం ఉన్న వారికి విదేశాల్లో అద్భుతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జర్మనీ, జపాన్, ఇజ్రాయెల్, గ్రీస్, యూరప్ వంటి దేశాల్లో నర్సింగ్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్ వంటి రంగాల్లో నిపుణుల కోసం ఆయా దేశాలు ఎదురుచూస్తున్నాయని చెప్పారు. టామ్ కామ్ సంస్థ ద్వారా అభ్యర్థులకు విదేశీ భాషలతో పాటు వృత్తి నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి పంపిస్తామన్నారు. విదేశాల్లో వారానికి కేవలం 35 గంటల పని ఉంటుందని, నెలకు సుమారు రూ. 2 లక్షల వరకు వేతనం లభిస్తుందని మంత్రి వివరించారు. నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం టామ్ కామ్ సంస్థకు రూ. 90 కోట్లు కేటాయించిందని వెల్లడించారు.

**జూన్ 10 నుండి శిక్షణా తరగతులు**

యువత సౌకర్యార్థం మందమర్రిలోనే ఈ శిక్షణ కేంద్రం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. జూన్ 10వ తేదీ నుండి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. పారిశ్రామిక శిక్షణ సంస్థలు, సింగరేణి ద్వారా అప్రెంటిస్ పూర్తి చేసిన వారు ఏకాగ్రతతో విదేశీ భాషలు నేర్చుకుని ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. కష్టపడి సంపాదిస్తే సమాజంలో గౌరవం ఉంటుందని, కుటుంబాన్ని చక్కగా చూసుకోవచ్చని హితవు పలికారు. చిత్తశుద్ధితో పనిచేసి ఆర్థికంగా ఎదగడమే కాకుండా మరికొందరికి బాట చూపాలని పిలుపునిచ్చారు.

**ఉద్యోగ భద్రతే లక్ష్యం**

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. విదేశాల్లో ఉద్యోగ భద్రతతో కూడిన సంతృప్తికరమైన ఉపాధి లభిస్తుందని తెలిపారు. కార్మిక చట్టాల ప్రకారం అక్కడ కార్మికులకు అన్ని రకాల రక్షణ, సామాజిక భద్రత ఉంటుందని చెప్పారు. స్థానిక యువత శిక్షణ కోసం దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా మందమర్రిలోనే ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఆసక్తి గల వారు వెంటనే తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఆయా దేశాలకు వెళ్లేందుకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని ఇక్కడ అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, భారీ సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.



# సదాశివపేటలో రూ. 12.80 కోట్ల అభివృద్ధి పనులు!

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శంకుస్థాపన
- పాత నిధులతోనే పనులు జరుగుతున్నాయని విమర్శ
- పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులకు ఆదేశం



**సంగారెడ్డి, మే 13 (జనం పవర్):** సదాశివపేట మున్సిపాలిటీ పరిధిలో టీయూఎఫ్ ఐడీసీ నిధుల కింద రూ. 12.80 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగింది. బుధవారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డితో కలిసి ఈ పనులను ప్రారంభించారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే లక్ష్యంతో ఈ పనులు చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సదాశివపేట మున్సిపాలిటీకి కొత్తగా నిధులు రాలేదని విమర్శించారు. 2018లో గత ప్రభుత్వం టీయూఎఫ్ ఐడీసీ ద్వారా రూ. 20 కోట్ల నిధులు మంజూరు చేసిందని, ప్రస్తుతం ఆ నిధుల్లో కొన్ని మార్పులు చేసి రూ. 12.80 కోట్ల పనులను ప్రారంభించారని పేర్కొన్నారు. గతంలో మూడుసార్లు టెండర్లు పూర్తయినప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయని ఆయన గుర్తు చేశారు. అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పనుల వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కాంట్రాక్టర్లు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, గతంలో ఎస్డీఎఫ్ కింద రద్దైన పనులను ప్రభుత్వం తిరిగి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా పట్టణ ప్రగతి కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది!

- కలివేములలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం
- రైతులు అధైర్య పడొద్దని నిర్మలా జగ్గారెడ్డి భరోసా
- ప్రైవేటు వ్యక్తులకు అమ్మి మోసపోవద్దు



**కంది, మే 13 (జనం పవర్):** చివరి వడ్ల గింజ వరకూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఈ విషయంలో రైతులెవరూ అధైర్య పడొద్దని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం కంది మండలం కలివేముల గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు విషయంలో నిబద్ధతతో ఉందని, రైతులు పండించిన పూర్తి ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. రైతులు తమ కష్టార్జితాన్ని ప్రైవేట్ రైస్ మిల్లర్ల వద్ద తక్కువ ధరకు అమ్మి నష్టపోవద్దని ఆమె సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యం అమ్మాలని, అక్కడ రైతులకు గిట్టుబాటు ధరతో పాటు భద్రత ఉంటుందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ బ్లాక్ ప్రెసిడెంట్ చిదృప్ప రఘు, కంది మండల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ మొగులయ్య, మాజీ ప్రెసిడెంట్ మోతి లాల్, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ పవిత్ర, ఉప సర్పంచ్ నాగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింహ రెడ్డి, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయంపై స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు.



జనం పవర్
JANAM POWER
గురువారం
14 మే 2026

# జన్నారంలో 'ధాన్యం' దోపిడీ.. రైతన్న ఆవేదన!



## తూకంలో భారీ మోసం.. అక్రమ వసూళ్ల పర్వం

### బస్తాకు 43 కిలోలు తూకం వేయాలని నిర్వాహకుల దౌర్జన్యం

### లారీ లోడింగ్‌కు పదివేలు.. బస్తాకు పది రూపాయల వసూలు

**జన్నారం మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు అన్నదాతల పాలిట యమపాశాలుగా మారాయి. ఒకవైపు అకాల వర్షాల భయం వెంటాడుతుంటే.. మరోవైపు ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల నిర్వాహకులు తూకంలో మోసాలు, అక్రమ వసూళ్లతో రైతుల నడ్డి విరుస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ బస్తాకు మూడు కిలోల వరకు అదనంగా తూకం వేస్తూ.. లారీ లోడింగ్ పేరుతో వేల రూపాయలు దండుకుంటూ బహిరంగంగానే దోపిడీకి తెరలేపారు.**

తుడుం జితేందర్, జనం పవర్, ఉత్తర తెలంగాణ బ్యూరో

జన్నారం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల పరిస్థితి 'అడవిలో పెట్టిన వెన్న'లా మారింది. ఒకవైపు ప్రకృతి కన్నెర్ర చేస్తుంటే.. మరోవైపు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై సామాన్య రైతు నడ్డి విరుస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ బహిరంగంగానే దోపిడీకి తెరలేపారు. ఐకేపీ, పీఏసీఎస్ సెంటర్ల దౌర్జన్యంపై రైతులు మండిపడుతున్నారు.

### తూకంలో భారీ మోసం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి గన్నీ బ్యాగులో 40 కిలోల 600 గ్రాముల ధాన్యం తూకం వేయాలి. కానీ జన్నారం మండలంలోని ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ కేంద్రాల్లో నిర్వాహకులు ఏకంగా 43 కిలోలు తూకం వేయాలని రైతులను వేధిస్తున్నారు. ఒక్కో బస్తాపై దాదాపు రెండున్నర కిలోల ధాన్యాన్ని అదనంగా నొక్కేస్తూ రైతుల నోట్లో మట్టి కొడుతున్నారు. నిలదీసిన రైతులకు పొంతన లేని సమాధానాలు చెబుతూ దౌర్జన్యానికి దిగుతున్నారు.

### అక్రమ వసూళ్ల బాదుడు

కేంద్రాల్లో హమాలీలు, కూలీల పేరిట జరుగుతున్న వసూళ్లు మిన్నంటుతున్నాయి. లారీ లోడ్ చేసినందుకు ఒక్కో వాహనానికి 10,000 రూపాయల వరకు డిమాండ్ చేస్తున్నారు. దీనికి తోడు ప్రతి బస్తాకు పది రూపాయల చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇస్తేనే ధాన్యం కదులుతుందని, లేదంటే వారాల తరబడి లారీలను నిలిపివేస్తూ రైతులను మానసిక వేదనకు గురిచేస్తున్నారు. ధాన్యం జోకిన తర్వాత రైతులకు కనీసం తూకం రశీదులు కూడా ఇవ్వడం లేదని బాధితులు వాపోతున్నారు.

### వర్షం ముప్పు.. మొలకల భయం

నెలలు గడుస్తున్నా రైస్ మిల్లులు ధాన్యం తీసుకోవడం లేదని.. గోదాములకు పంపిద్దామంటే లేబర్ లేరని సాకులు చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ ఆకాశం వైపు చూస్తూ గడపాల్సి వస్తోందని, వర్షం వస్తే ధాన్యం తడిసి మొలకలు వస్తాయని ఆందోళన చెందుతున్నారు. ఎంత నష్టమైనా పర్వాలేదు.. ధాన్యం కేంద్రం నుంచి కదిలితే చాలు అనే స్థితికి రైతులను దిగజార్చారు.

### ఆందోళనకు సిద్ధం

రైతులపై జరుగుతున్న ఈ ఆర్థిక దౌర్జన్యంపై వివిధ రైతు సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమ తూకాలు వేస్తున్న సెంటర్లపై, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



# అధికారుల ముందే 'సర్కారు' భూమి స్వాహా!

- జన్నారంలో యథేచ్ఛగా సాగుతున్న కబ్జా పర్వం
- ఎమ్మార్వో ఆఫీసు వెనుకే అక్రమ నిర్మాణాలు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

తుడుం జితేందర్ జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో

కంచే చేను మేసిన చందంగా జన్నారం మండల కేంద్రంలో ప్రభుత్వ భూమి కబ్జాదారుల పాలవుతోంది. భూమిని కాపాడాల్సిన రెవిన్యూ కార్యాలయాల వెనుకాలే ఏకంగా ఐదు ఎకరాల భూమి అక్రమార్కుల పరమవుతోంది. సాక్షాత్తూ మండల పరిపాలన సాగే తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల వెనుక గజం లక్షలు పలికే భూమి ఆక్రమణకు గురవుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై స్థానికులు మండిపడుతున్నారు.

### అడ్డూఅదుపు లేని ఆక్రమణలు

జన్నారం ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాల వెనుక భాగంలో గల సర్వే నంబర్ 374లో సుమారు 5 ఎకరాల 8 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. ఈ విలువైన భూమిపై కన్నేసిన కొందరు అక్రమార్కులు రాత్రికి రాత్రే హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. అంతటితో ఆగకుండా ప్రస్తుతం అక్కడ దర్జాగా ఇళ్ల నిర్మాణాలు కూడా చేపట్టారు. సామాన్యుడు చిన్న తప్పు చేస్తే విరుచుకుపడే యంత్రాంగం.. ఐదు ఎకరాల భూమి కబ్జా అవుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు నిలదీస్తున్నారు. అధికారుల అండ లేనిదే ఇంత ధైర్యంగా ప్రభుత్వ భూమిలో ఇళ్లు కట్టడం సాధ్యమా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### బుట్టదాఖలైన ఫిర్యాదులు

ఈ అక్రమ దందాను అడ్డుకోవాలని సామాజిక కార్యకర్త ప్రభాకర్ గత కొంతకాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. స్థానిక తహసీల్దార్‌కు ఆధారాలతో సహా మొరపెట్టుకోవడంతో పాటు ఎంపీడీవో, ఈవోలకు అక్రమ నిర్మాణాల గురించి వివరించారు. చివరికి జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకెళ్లారు. ఫిర్యాదులు అందినప్పుడు "చూస్తాం.. చేస్తాం" అని చెప్పే అధికారులు క్షేత్రస్థాయిలో కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కబ్జాదారులు పునాదులు వేసి గోడలు లేపుతున్నా పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### కూల్చివేయాలని డిమాండ్

కోట్ల రూపాయల విలువ చేసే ఈ భూమిని కాపాడాల్సిన బాధ్యత రెవిన్యూ శాఖపై ఉంది. ఇప్పటికే సగానికి పైగా భూమి కబ్జాదారుల చేతుల్లోకి వెళ్ళిపోయిందని, వెంటనే అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఈ భూమి శాశ్వతంగా ప్రైవేటు వ్యక్తుల పరం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. మరి ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జన్నారం మండల కేంద్రంలోని ఈ భూ బాగోతంపై విచారణ జరిపిస్తారో లేదో చూడాలి.



